లోకమందు పెక్కు భీకర కృత్యముల్
జరుగు కారణంబు అరయవలయు
స్వార్థ రహిత సేవ సన్నగిల్లుట చేత
అర్థ రహిత వాంఛ లధికమయ్యె

ప్రేమ సేవలు రెండును రెక్కలు మనకు
పక్షమున విహరించెడి పక్షి వోలె
ఆ విహంగ మార్గములను అనుసరించి
చేరవలయును గమ్యంబు శీఘ్రగతిని

. దివ్యాత్మ స్వరూపులారా!

మానవుని వృత్తిచే పరచునది, వున్నత స్థాయికి గొని పోవునది నిష్కామ సేవయే. మానవుని మనో బుద్ధులకు కావలసినంత శక్తి సామర్థ్యముల నందించి, మానవత్వమును మేల్కొల్పునది నిష్కామ సేవయే. అభ్యుదయమునకు కేవలము కర్మకుశలత మాత్రమే చాలదు. ప్రేమ, దయ, నీతి, నిజాయతి, సానుభూతి, క్షమలు అత్యవసరమైనట్టివి. ఇట్టి వుత్తమ గుణములు లేక మానవుడు నిష్కామ కర్మ ఆచరించుటకు సాధ్యము కాదు. మానవుడు నిత్యము అనుభవించే సుఖదుఃఖములు సాధించె రాగద్వేషములు, చవి చూచే విషయ వాసనలకు మనోవికారములే మూలకారణము ఇది నాది అది నీది అనే ద్వైత భావమేమో వికారములకు మూలకారణము. లోకము యేమైనా అయిపోనీ నేను మాత్రము క్షేమముగా వుండాలనే స్వార్థ భావమే యీ ద్వైతము నకు మూలకారణము స్వార్థ భావముల యొక్క ఫలితమే రాగద్వేషములకు మూలకారణము. కేవలము దేహమే నేననియు నా కుటుంబము, నా సంపద, నా యొక్క స్థితియే నాకు ప్రధానమనియు భావించే మానవుడు కేవలము ఒక స్వార్థ పరమైన జీవితము. అట్టి మానవునకు సత్యమే అసత్యము. అసత్యమే సత్యముగా పరిణమిస్తూ వుంటుండాది.

అట్టి కరడు కట్టుకున్న మానవుని హృదయమందున్న మాలిన్యము దూరము చేయవలెనన్న సేవయే ప్రధానమైన మార్గము. నిష్కామసేవ నిమిత్తమై యేర్పడినదే మానవ జన్మము గాని స్వార్థమునకు కాదనే సత్యాన్ని గుర్తించటము అత్యవసరము. ఈ సేవలు కేవలము పేరు ప్రతిష్ఠల కోసము చేయరాదు. ప్రపంచములో తన యొక్క అధికారమును ప్రకటితము గావించే నిమిత్తము సేవలు చేయరాదు లోక సేవల ద్వారా తన యొక్క స్వార్థమును స్వప్రయోజనమును నెరవేర్చుకొనే నిమిత్తము సేవలు చేయరాదు. ఈ విధమైన సేవలు సేవలు అనిపించుకోవు స్వార్థస్వప్ర

22118802

యోజనములకై ఆచరించే ప్రక్రియ అని భావించవచ్చు. సేవయందున్న పవిత్రత, సేవయందున్న దివ్యత్వము మానవుడు గుర్తించుకొనలేక సేవలలో పాల్గొనుటకు వెనుకంజ వేస్తున్నాడు. కనుక సేవాభావమనేది కేవలము యీ దేశమును వుద్ధరించుటానికి సేవలు చేస్తున్నామని భావించటము చాలా పొరపాటు. దేశమునుద్ధరించుటకై నీవు సేవ చేయనవసరము లేదు. ఈ సేవలన్నియు కేవలము నిన్ను నీవు వుద్ధరించుకొనుటకు చేస్తున్నానని భావించాలి. పరసేవా ఫలితము, పరసేవ యొక్క దివ్యత్వము తాను గుర్తించుకొనలేక కేవలము యితరులకు సేవచేస్తున్నామనే అహంకార భావము చేత స్వార్థపరమైన దృష్టి చేతను సేవలలో పాల్గొంటున్నాడు మానవుడు

సద్గుణంబులు త్యాగంబు సత్యనిష్ట
లేని మనుజుండు ప్రాణము లేనివాడె

సేవ చేయని జీవితము చీకటింటి జీవితముగా భావించాలి.

మన జీవితము సమాజమునుండియే ఏర్పడినది. కీర్తి ప్రతిష్టలు గానీ, సుఖ సంతోషములు గానీ, భోగభాగ్యములు గాని యీ సమాజము నుండియే మనము అందుకొనగలుగుతున్నాము. సర్వసమస్యలు తీర్చే యీ సమాజమునకు, సర్వసుఖములు అందించే యీ సమాజమునకు మానవత్వాన్ని వికసింపచేసే యీ సమాజమునకు సేవలు చేయకున్న యింక ఎవరికి చెయ్యాలి. ఇన్ని విధములుగా పరిశోధనలచే పరిశీలన ద్వారా పరమతత్వాన్ని మనకు బోధించిన ప్రకృతికి మనము సేవలు చేయకున్న ఎవరికి చేయాలి. మన చేతి రుమాలు క్రింద పడితే దానిని ఎవరైనా ఎత్తి యిచ్చినప్పుడు Thanks అని వాళ్ళకు మన యొక్క కృతజ్ఞతను అందిస్తున్నాము. కానీ యిట్టి పవిత్రమైన, దివ్యమైన మానవత్వానికి యిన్ని అనుకూలములు, యిన్ని సరైన సౌకర్యములు చేకూర్చి అందించిన ప్రకృతి సమాజమునకు మనము యింత మాత్రమైన Thanks చెప్పనక్కరలేదా. ఇట్టి కృతజ్ఞతలేని మన జీవితము కేవలము క్రూరమృగములకంటే హీనమని తలంచాలి. సేవ అనేది కేవలము మానవుని ప్రధాన కర్తవ్యము. మన జీవితము యొక్క ప్రధాన లక్ష్యము. ఇట్టి లక్ష్యమును మనము విస్మరించి అలక్ష్యమును విశ్వసించి జీవితమును వ్యర్థము గావించుకొనుచున్నాము.

సేవకు కావలసినది ధనము, ధాన్యము యిత్యాది పదార్థము కాదు అవసరము. ప్రేమ హృదయము లేక ఎన్ని సేవలు చేసినప్పటికిని అది కేవలము వ్యర్థమే అవుతుంది. మనము యీనాడు నింపుకోవలసినది ప్రేమతత్వాన్ని హృదయములో నింపుకోవాలి. ప్రకృతి యొక్క చైతన్యము వ్యర్థమైనది కాదు. అహంకార పరమైనప్పుడు వికృతమవుతుంది. ఆత్మపరమైనప్పుడు సుకృతమవుతుంది. ఈ పవిత్రమైన భావము సర్వజంతువులనుండి వేరుచేసి దివ్యమానవునిగా నిరూపించినదో అట్టి మానవత్వాన్ని యీనాడు మనము విస్మరిస్తున్నాము. కాని యీనాడు మనము కేవలము మానవునియొక్క

ఆకారముగా నిరూపిస్తున్నది గాని మానవత్వమనేది ఆమనిషియందు యే మాత్రము కనుపించుటయే లేదు. మనము సమాజములో లోతుగా దిగి విచారించినప్పుడు యీనాడు అవసరమైనది ధనము, అధికారము, లౌకిక భోగభాగ్యములు యివియే తప్ప యింక అన్యమైన విచారములు మానవుడు సల్పటంలేదు. ధనమే మానవుని వుద్ధరించుచున్నదనే భావము యీ ప్రజల లోపల అమితముగా పెరిగిపోయింది. అదియే మానవత్వ నిర్మూలమునకు ముఖ్యకారణము. ఈ ధనము మనను పోషించుటలేదు. ఈ ధనమే మనలను రక్షించుటలేదు. ధనము అవసరమే. కాని మితమైన ధనముతో హితమైన జీవితాన్ని గడపాలి. ఈనాడు సేవలయందు గాని, మరియే విధమైన సంస్థలయందు గాని ఆడంబరము, అహంకారము వున్నత స్థాయిని అందుకున్నది. ఆడంబరము వుండినంతవరకు ఆత్మతత్త్వము అర్థము కాదు. ఇట్టి ఆత్మతత్త్వము అర్థము కాకుండా మానవత్వాన్ని వికసింపచేయలేడు. మానవత్వము వికసింపచేసుకొనకుండా అసలు మానవుడే కాదు. వాడు ఆకార మానవుడనే చెప్పవచ్చును గాని ఆత్మసమున్నతమైన మానవుడు కాదనే వుద్దేశ్యము ప్రపంచమునకు ప్రకటితమవుతుంది. కనుక సేవలయందు ప్రధానమైనది త్యాగము. ఈ త్యాగభావమనేది కేవలము అహంకారమును మొట్టమొదట త్యాగము చేయాలి.

భావమందు ద్వైత భావము విడుటే
త్యాగమగును అదియె యోగమగును
ఆస్తి ఆలి విడి అడవికేగుట కాదు

మన పవిత్రమైన భారతీయ సంస్కృతి యందున్న ప్రధానమైన సూత్రములను సరైన అర్థము చేత ప్రజలకు బోధించే వ్యక్తులు లేకపోవటం చేతనే యీ విధముగా సమాజము పెడమార్గము పడుతున్నది. ఎవరికో మనము సేవ చేస్తున్నామనే భావము చాలా పొరపాటు. ఆరూపములో నున్న పరమాత్మకే నేను సేవ చేస్తున్నాననే వున్నతమైన, పవిత్రమైన భావము కలగాలి. ప్రతి వ్యక్తియందు భగవంతుడున్నాడనే విశ్వాసమును మనము అభివృద్ధి పరచుకోవాలి.

పరుల దూషణ చేయ పాపఫలంబబ్బు
విడువ దెన్నటికిని విశ్వమందు
పరులు పరులు కారు పరమాత్మ డేయగు

కనుక యెవ్వరిని కూడను మనము బాధించరాదు. ఎవరిని మనము దూషించరాదు. అది కేవలము నీయొక్క దుర్గుణముల యొక్క స్వభావము. తనయందు అణగి మణగి యున్న దుర్గుణములు తాను ప్రకటించుకొనే అవివేకమే. యితరుల దోషములను నీవు ఒక్క వేలితో చూపుతున్నప్పుడు నీయందున్న పది దోషములు యితరులు చూపటానికి సిద్ధముగా వుంటారు. ఈ సత్యాన్ని గుర్తించుకున్న వ్యక్తి యెవ్వడూ కూడను యితరు

221118804

లను దూషించరాదు. తనను తాను గొప్పగా చెప్పుకోటం ఇతరులను చిన్నగా చూడటం తుచ్ఛని యొక్క స్వభావమే. ఇలాంటి దుర్గుణములు, ఇలాంటి దుర్భావములు, మానవు నుండి దూరమైనప్పుడే మానవుడని చెప్పటానికి సాధ్యమవుతుంది. కనుక ప్రతి వ్యక్తియందు కూడను మనము భగవద్దర్శనము చేయాలి. అప్పుడే నిజమైన సేవయందు ఒక విధమైన ఫలితము లభిస్తుంది. ఫలనిమిత్తమై మనము సేవలు చేయక ఇది నా ప్రాప్తి అనే భావముతో మనము సేవలు చేయాలి. ఇలాంటి పవిత్ర భావముతో నిర్మల నిశ్చల నిస్వార్థమైన మార్గములో మనము ప్రవేశించినప్పుడే ఇది సేవ అనిపించుకుంటుంది.

దివ్యాత్మస్వరూపులారా! ఈ సేవలు కేవలము నీయొక్క పవిత్రతను ఆశించి, ఉన్నత స్థాయిని కోరి మమ భక్త ప్రపత్తుల చేత దీనిని నియమించుకోటమే గానీ ఈ సేవలకు గాని స్వామికి గాని ఎట్టి సంబంధము లేదు. కర్మల చేత మనయొక్క మాలిన్యములు కడిగివేయవచ్చునని ఉద్దేశము చేత, చిత్తస్య శుద్ధయే కర్మణః, చిత్తశుద్ధి నిమిత్తమై కర్మలాచరించమని మాత్రమే స్వామి యొక్క ప్రబోధ. ఏ కర్మలు పవిత్రమైన కర్మలు ఆచరించినప్పటికిని అది కేవలము నీయొక్క మాలిన్యము నీవు దూరము చేసుకొనటమే. కర్మల ద్వారా కేవలము ముక్తి కలుగుతుందని గాని, జన్మసార్థకమవుతుందని గాని భావించటం చాలా పొరపాటు. చిత్తశుద్ధిచేతనే జన్మసార్థకత్వము ఏ రీతిగా లభించగలదు. కాన చిత్తశుద్ధి నిమిత్తము ఈ కర్మలాచరిస్తున్నామనే భావము మీరు హృదయములో అభివృద్ధి చేసుకోవాలి. ఈనాటి కర్మల యొక్క స్వభావము జన్మను సార్థకము గావించుకునే నిమిత్తమనే భావము మీరు దూరము చేసుకోవాలి. ఇలాంటి పవిత్ర నిష్కామ కర్మ నిమిత్తమై ఈ జన్మ ఏర్పడినదనే సత్యాన్ని గుర్తించాలి. జన్మ నుండి కర్మ, కర్మ నుండి ధర్మ, ధర్మ నుండి మనకు దైవము ప్రాప్తించాలి. అదే జన్మ కర్మ ధర్మ బ్రహ్మ ఈ నాల్గింటి యొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యమును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కర్మలు చేయటానికి లేక సేవలు చేయటానికి నాకు వ్యవధి లేదనియు, కేవలము ఆఫీసు పనులున్నాయనియు, ఇంకా అనేక విధములైన బాధ్యతలున్నాయనియు దీనికి సాకు చెప్పి తప్పించుకోటము ఇది కేవలము బలహీనత. సేవలు చెయ్యాలంటే కేవలము పనులలో ప్రవేశించి బజార్లు ఊడ్చి ప్రజలకు సేవ చేయటము మాత్రమే కాదు. నీ డ్యూటీయందు కూడను, నీ పనియందు కూడను, నీవు చేసే అధికారము యందు కూడను సక్రమమైన రీతిగా నీవు ఆచరించటము అది కూడా సేవయే. నిజముగా ఈ అధికారములో అధికారులుగా ఉంటున్నవారు సేవలు ఏ విధముగా భావించాలంటే తాము పుచ్చుకునే జీతమునకు తగిన పని చేయటమే గొప్ప సేవ. కానీ ఏ పనివాడు కూడను ఏ అధికారి కూడను తాను పుచ్చుకునే జీతమునకు తగిన పని చేసేవాడు ఎక్కడ కూడను కనుపించటము లేదు. ఇంకా ధనము అధికము కావాలి అని ఆశిస్తున్నాడే గాని ధనమునకు తగిన కర్మలు నేను ఆచరిస్తున్నానా లేదా

ఇది కేవలము దేశ ద్రోహముగా భావించుకోవాలి. ఇది ఎవరి ధనము ప్రజల ధనము ప్రజలకు ఈ విధమైన అపకారము చేయుటము కూడను సేవకు విరుద్ధమైన మార్గమే. ఒక అధ్యాపకుడు వుంటున్నాడు. అతను పిల్లలకు ప్రబోధ చేస్తున్నాడు. కాని ఆ చేయవలసిన బోధలు వుత్తమమైన మార్గములో చేయుటము అది కూడను సేవయే. ఒక వ్యాపారి వుంటున్నాడు. బజార్లో పోయి వూడ్చనక్కర లేదు. తన వ్యాపారములో కూడను తన నిర్ణీతమైన ఆదాయమునకు మించి తాను యేమాత్రము ముందుకు పోకూడదు అది కూడను సేవయే. కానీ అట్టి భావము మనసులో వుంచుకున్నప్పుడు వాడు సేవకుడుగా చెప్పుకనే రూపొందుతాడు. తన మనసుకు తాను తృప్తి పరచుకునే మార్గములో తాను ప్రవేశించాలి. నేను సక్రమముగా చేస్తున్నానా లేదా అనేటువంటి తన conscience కి తనకే చక్కని తృప్తి నందించాలి. కనుక స్వామికి ప్రీతికరమైనది యేమంటే తన కర్తవ్యమును సక్రమముగా నిర్వర్తించటమే సేవ. అవకాశము చిక్కినప్పుడు ఈ సమాజములో ప్రవేశించి ఈ సమాజానికి సేవలు చేయి. కేవలము వ్యక్తి యొక్క సేవయే సేవగా భావించరాదు. సమిష్టి దేశము యొక్క సేవ కూడను ప్రధానమైన సేవయే. ఈ విధమైన సేవా భావము నందే దివ్యమైన దైవత్వము మనము అనుభవించటానికి యింతైనా అవకాశము వుంటున్నాది.

ఆ సేవా భావమును ఎవ్వరు కూడను ఏ విధముగా కూడను ఆశ్రయించనక్కరలేదు. నీకు యిక్కడ సేవ అవసరమని నీ దృష్టిపడిన దగ్గరంతా కూడ నీవు నడుము మచి పని చేయి. కేవలము ఇట్టిది అట్టిది అనే బేధ భావము నీవు చూడవద్దు. ఇతను బీదవాడా లేక శ్రీమంతుడా అనే తారతమ్యము నీకు అక్కర లేదు. ఎలాంటి వారికైనా, ఏ స్థానమునందైనా, ఎప్పుడైనా అవసరమైనప్పుడు నీవు అందులో ప్రవేశించి సేవలు చేయుటము అత్యావసరము. కష్టములు, దుఃఖములు, బాధలు అందరికి సమానమే. కనుక అలాంటి పరిస్థితుల యందు నీవు యేమాత్రము విచారణ చేయకుండా ఆ సేవలలో పాల్గొనటము అత్యవసరము ముఖ్యముగా ఈనాడు పల్లెలయందు చాలా అనానుకూలమైన పరిస్థితులలో జీవిస్తున్నారు ప్రజలు. అలాంటి పరిస్థితిలో మనము పల్లెలకు వెళ్ళి వారికి సేవా భావము అర్థమయ్యే రీతిగా బోధించి వారిని కూడను ఈ సేవలలో పాల్గొనేటట్లు మనము ప్రవేశపెట్టాలి. చాలామంది పల్లెలకు వెళ్ళి అశుభ్రమైన ప్రదేశాన్ని శుభ్ర పరుస్తున్నారు. కొన్ని మాలిన్యములుగా వున్నదానిని పరిశుద్ధము చేసి వస్తున్నారు. ఈ రీతిగా ఎంతకాలము చేయగలరు. ఈ పరిశుద్ధము ఎందుకు చేస్తున్నాము. ఈ మాలిన్యము ఎందుకు దూరము చేస్తున్నాము అనే విషయము ఆ పల్లె ప్రజలకు అర్థమయ్యే రీతిగా మనము బోధించాలి. దీని వలన మనకు మన బిడ్డలకు అనారోగ్యము ఏర్పడుతుంది. ఈ అనారోగ్యము వలన మన జీవితమనేది చాలా క్షీణించి పోతుంది. మన కర్తవ్యమును మనము నిర్వర్తించుకో లేక పోతాము. కనుకనే ఆరోగ్యమే మహా భాగ్యము అనే విషయమును వారికి బోధించినప్పుడు వారే యిందులో ప్రవేశించి నిత్యము వారు శుభ్రము చేసుకోటానికి ప్రయత్నిస్తారు. అట్లు కాకుండా

కేవలము నెలకొక పర్యాయము, రెండు నెలలకొక పర్యాయము మనము పరిశుభ్రము చేసి
నంత మాత్రమున అంత ప్రయోజనము లేదు. పల్లె ప్రజల చేతనే ఆపల్లె పరిశుభ్ర పరచు
టానికి తగినంత ప్రయత్నము చేయాలి.

అదే విధముగనే పూర్వము ceiling on desires అనే నిర్ణయము చే
శారు. అనగా దీని యొక్క అంతరార్థమేమిటి? మానవుడు మితి మీరిన కోరికల చేత మతి త
ప్పి భ్రమిస్తున్నాడు. కేవలము ప్రవృత్తిపై జీవిస్తున్నాడు. పరతత్వాన్ని విస్మరిస్తున్నాడు
కనుక మొట్టమొదట యీ కోరికలను కొంతవరకు అదుపులో పెట్టుకోవాలనే వుద్దేశ్యము
తోనే ceiling on desires అనే పేరుతో స్థాపించారు. ధనమును కూడను అమితముగా
వ్యయము చేస్తున్నాము. ఈ విధముగా వ్యయము చేసే బదులు ఆధనమును ప్రజలకు, దిక్కు
లేని వారికి, దీనులకు తగిన రీతిగా వుపయోగపెట్టాలనే వుద్దేశ్యముతో దీనిని ప్రారంభించారు
కాని దీని యొక్క సత్య స్వరూపాన్ని గుర్తించుకొనలేక యిది కేవలము డబ్బు యివ్వటమే ప్రధా
నమైన లక్ష్యములో వుంచుకొని వారి యొక్క కోరికలను యథారీతిగా పెంచుకుంటూనే
పోతున్నారు. మన కోరికలను తగ్గించుకోవాలి. మన ప్రాపంచిక సంబంధమైన విషయాలు
ఎంతవరకు మనము పెంచుకొందుమో అంతవరకు మనకు అశాంతి పెరుగుతుంది. దీని
వలన మానవుడు బంధింపబడుతున్నాడు. ఈ బంధన నుండి మనము విముక్తి కావా
లంటే కోరికలు తగ్గించుకోవాలి. ఎంత అవసరమో అంతవరకే పెంచుకోవాలి.

కోరికలు యే విధముగా తగ్గించుకోవాలి. నీకు ఎంత అవసరమో అంత
భోజనాన్ని నీవు భుజించు. అనవసరముగా నీవు ఆకలికి దండిగా వడ్డించుకొని వ్యర్థము
చేయటము దోషముగా వుంటుంది. ఆ అన్నము యింకొక వ్యక్తికి పెట్టి వానిని సంతృప్తి పర
చవచ్చును. కనుక మొట్టమొదటిది Do not waste food. నీవు ఆహారము ఏమాత్రము
వ్యర్థము చేయకూడదని యిది ప్రధానమైన సూత్రముగా తీసుకున్నారు. అన్నం బ్రహ్మ
ప్రాణం బ్రహ్మ. అన్నము నుండియే మానవుడు వర్ధిల్లుతున్నాడు. మానవుని యొక్క జీవి
తమునకు గానీ, మానవుని యొక్క దేహమునకు గానీ, మానవుని యొక్క మనస్సుకు గానీ
అన్నమే ప్రమాణము అన్నమే ప్రధానము. మానవుడు భుజించిన ఆహారము పురస్కరిం
చుకానియు స్థూలమైన ఆహారము మలముగా పోతున్నది. సూక్ష్మమైన ఆహారము రక్తము
గా మారుతున్నది. అతి సూక్ష్మమైన ఆహారము మనస్సుగా మారుతున్నది. కనుక ఎట్టి ఆ
హారమో అట్టి మనస్సు. ఈనాడు మనయందు యీ రావణ బుద్ధులు అభివృద్ధి కావట
నికి ఆహారమే మూలకారణము. దయ, దాక్షిణ్యము, సహనము, ప్రేమ లేకుండా కేవ
లము ద్వేషము, అసూయ, రాగము యిలాంటి దుర్గుణముల చేత మనము అభివృ
ద్ధి పొందుతున్నాము. దీనికంతా ఆహారమే మూలకారణము. కనుక ఆహారము
అతి పరిశుద్ధమైనదిగను, అతి పవిత్రమైనదిగను, అతి సాత్వికమైనదిగను వుం
డాలి. అట్టి ఆహారము చేతనే మానవ రూపము ఏర్పడుతున్నది. మనము త్రాగే

221118807

జలమే స్థూలమైనది ఒకవిధముగా మూత్రముగా పోతున్నది. అతిసూక్ష్మమైనది ప్రాణముగా రూపొందుతున్నది. కనుక జలము, ఆహారము యీరెండింటి యొక్కతత్వము చేతనే మానవుని యొక్క జీవితము దివ్యత్వాన్ని అందుకొనుటకు వీలవుతుంది. అన్నం బ్రహ్మ అన్నారు. అన్నమును వ్యర్థము చేస్తే నీవు దైవత్వమును వ్యర్థము చేసినవాడవౌతావు. కనుక సాధ్యమైనంత వరకును సాత్వికాహారము ఎంతవరకో అంత వరకు భుజించి మిగిలినది ఎవరికైనా పరోపకారము చెయ్యి.

రెండవది ధనము. ఇది కేవలము భారతీయులంతా లక్ష్మీస్వరూపకముగా భావిస్తూ వుంటారు. దీనిని దుర్వినియోగము చేయకూడదని చెప్పారు. దీనిని దుర్వినియోగము చేసినప్పుడు మనకు కేవలము దుర్భావములు, దుర్బుద్ధులే అభివృద్ధి అవుతాయి కనుక ధనమును సద్వినియోగము చేయాలి. Do not waste money. misuse of money is evil అన్నారు. ఇది కేవలము తప్పు మార్గము అనుసరింపచేయువంటిది. ఇంక మూడవది అత్యవసరమైనది, ప్రధానమైనది కాలము. కాలమును వ్యర్థము చేయకూడదు. కాలమును సార్థకము చేయాలి. ఎందుకంటె సర్వము కాలముపైనే ఆధారపడి వుంటున్నది. కనుకనే శృతులయందు కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః, కాల నియమితాయనమః అంటూ కాలము చేతనే ఆధారపడి వుంటున్నాది. మానవుని యొక్క జనన మరణములకు కూడను మూలకారణము కాలమే. మనము పుట్టి పెరగటానికి కూడను కాలమే ప్రమాణము. కాలము వ్యర్థము చేస్తే జీవితమే వ్యర్థమై పోతుంది. కనుక కాలమే మనకు ప్రధానమైన ప్రాణము అనవసరమైన మాటలలో నీవు ప్రవేశించి యితరుల యొక్క మంచి చెడ్డల విమర్శలలో నీవు ప్రవేశించి కాలమును నీవు అపవిత్రము చేసుకోవద్దు. ఈ విధమైన దుర్బుద్ధుల లోపల, దుర్వృత్తుల లోపల కాలమును ప్రవేశపెట్టకుండా దానిని సద్వినియోగము గావించుకోటం కొరకే don't waste time అన్నారు. కాలము వ్యర్థము చేయవద్దన్నారు. నాల్గవది మనయొక్క శక్తిని, శరీరమానసిక శక్తి, ఆధ్యాత్మిక శక్తిని కూడను వ్యర్థము చేయకూడదు. ఈ శక్తి యథారీతిగా వుంటుండాలి. చెడ్డ చూడటంలోపల కూడను శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ వినటములో కూడను శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ మాట్లాడటంలో కూడను శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ తలంపులు చేయుటం కూడను మన శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ పనులు చేయుటం చేత మన శక్తి వ్యర్థమవుతున్నది. కనుక యీ విధింటి యందు సక్రమమైన మార్గమును అనుసరించి నీ శక్తిని అభివృద్ధి పరచుకొని దివ్యత్వముగా మార్చుకోమని దీని అంతరార్థము.

See no evil, see what is good
Hear no evil, hear what is good
Talk no evil, talk what is good.

221118808

Think no evil, think what is good
Do no evil, do what is good
This is the way to GOD.

మనము చెడ్డను చూడకుండా, చెడ్డను వినకుండా, చెడ్డను తలచకుండా మంచినే మనము చూస్తూ వుంటుంటే యిదే దైవత్వానికి మార్గము.

కనుక యీవిధముగా వుండటము చేత మన శక్తినంతా వ్యర్థము చేయటం చేత జ్ఞాపకశక్తి పోతున్నాది, ప్రజ్ఞాశక్తి పోతున్నాది, మేధాశక్తి పోతున్నాది, పరిణామ శక్తికూడా పోతున్నాది. కనుకనే యీనాటి మానవునకు విచక్షణా జ్ఞానము శూన్యమై పోయింది. ఇంక క్రియా శక్తి యేవిధముగా ప్రవేశించగలదు. ఇది ఎట్లా వ్యర్థమవుతున్నాదని కూడను కొంతవరకు అనుమానము కలుగవచ్చును. ఒక రేడియో వుంటుండాది. ఆ రేడియోను యేదో ఒక స్టేషను పైన adjust చేసి న్యూస్ మనము వింటున్నాము. దాని sound పెద్దగా చేయి లేక చిన్నగా చేయి ఆన్‌లో పెట్టి వుంచితే చాలు కొన్ని యూనిట్లు కరెంటు ఖర్చు అవుతుంది. అదేవిధముగనే మన దేహము ఒక రేడియో వంటిది. నీవు నోటితో మాట్లాడినా మనసుతో తలచినా లోపల నీవు సంప్రదించుకున్న అదంతా కూడను బాగా అయినట్టే ఎందుకుంటే పని చేస్తున్నాదక్కడ. అలాగే వుంటున్నాది. నిద్రించేంతవరకు కూడను ఏదో ఒకటి చింత చేస్తుంటావు. ఈ చింతలు చెడ్డ చింతలు చేయకుండా మంచి చింత చేస్తే ఎంత హాయిగా వుంటాది. కనుక యీవిధముగా నీవు చింతన చేసి, కార్యములో ప్రవేశించి నీ యొక్క దివ్యమైన శక్తిని వ్యర్థము చేసుకుంటున్నావు. కనుక యీవిధముగా నాలుగు కూడను కొంతవరకు అదుపులో పెట్టాని జీవించమనే ceiling on desires అని పేరు పెట్టారు. కానీ యీనాటి సేవకులు యీవిధముగా చేయుటము లేదు. ఏదో సాయి సంస్థలలో ధనము కోసమని యీవిధముగా ప్రారంభించారనే వుద్దేశ్యముతో ధనము నివ్వటము వారు తప్పించుకోటము యీవిధమైన యుక్తి చేతనే వారు తమ జీవితమును వ్యర్థము చేస్తున్నారు. దీనిని సత్యసాయి సంస్థలు యేనాడు కూడను ఆశించలేదు. మీరు జగత్తునకు ఆదర్శవంతమైన జీవితాన్ని నిరూపించమనే యీ సంస్థలను ప్రారంభించింది. కనుక మనము ఆదర్శవంతముగా జీవించి యితరులకు ఆదర్శము నందించే ఉత్తమోత్తములుగా రూపొందాలి. కనుక మన మనో వృత్తులలో క్రమక్రమేణా మార్చుకొనుటకు ప్రయత్నించాలి. సాయి సంస్థలలో జాతి మత భేదములకు అవకాశము నందించ కూడదు

దివ్యాత్మ స్వరూపులారా! మన జాతికంటె నీతియే ప్రధానము. మన మతము కంటె మమత పెంచుకోటానికి ప్రయత్నించాలి. మమత లేనివాడు మతమును పెంచుకొని ప్రయోజనమేమిటి? ఈ మతము మతిని చెడగొడుతున్నది. మన మతము ఒక్కటే మతము మానవ మతము. మన నీతి యేమిటి ప్రేమయే నీతి. ఇలాంటి ప్రేమ తత్వాన్ని మనము పెంచుకొని నీతి నిజాయితీలను ఆదర్శముగా నిరూ

పించి తోటి మానవులను మనము సరైన మార్గములో ప్రవేశింప చేయుటానికి ప్రయత్నించాలి. అనాది కాలము నుండి మన భారతదేశము అనేక విధములైన సత్యధర్మములను ప్రబోధిస్తూ వచ్చినది. కనుకనే సత్యం వద ధర్మం చర అనే పవిత్ర సూక్తులను యీనాటికి కూడను మారు మ్రోగుతున్నవి. కాన అట్టి దివ్యమైన భారతదేశము సత్యధర్మములతో సహన సానుభూతులతో దీనిని ప్రవేశపెట్టినప్పుడు యింతకంటె దేశము యొక్క కళ్యాణము మరొకటి వుండదు. ఇలాంటి దివ్యమైన భావములో విశాలము గావించుకోవాలి. కేవలము వైజ్ఞానము వైజ్ఞానమని వైజ్ఞానము పెంచుకొని వివేకము లేకుండా పోతే వైజ్ఞానము వ్యర్థమే. కనుక నూరుమంది మేధావులకంటె ఒక్క మంచి మనసు కలిగిన వాడు చాలు. మంచి మనసు కలగాలి. ఆ మంచి మనసు వున్న వాని చేత జగత్తంతా యెంతైనా కూడను మంచిగా మార్చవచ్చు. కనుక మనిషి అంటే మనసు నుంచి వచ్చిన వాడని మనసు వుత్తమమైనది గను, పవిత్రమైనది గను వుండినప్పుడే వాడు మనిషిగా రూపొందుతాడు. కనుక యిలాంటి మనస్తత్వాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. నీకు యింద్రియముల యొక్క వికాసము యెంతైనా వుండవచ్చును. ఇంద్రియముల యొక్క వికాసము యెంతైనా వుండవచ్చును. మానసిక వికాసము అంతకంటె అధికముగా వుండవచ్చును. బుద్ధి యొక్క వికాసము అంతకంటె లక్షణముగా వుండవచ్చును. వాటితో బాటు ఆధ్యాత్మిక వికాసము అత్యవసరమని గుర్తించాలి. ఈ ఆధ్యాత్మిక వికాసమే లేకపోతే యీ యింద్రియ వికాసము, మనో వికాసము, బుద్ధి వికాసము కేవలము కృత్రిమముగా రూపొందుతుంది. ఇది కేవలము యాంత్రికమైన జీవితమవుతుంది. కాదు మనము మంత్రమయమైన జీవితముగా రూపొందింప చేసుకోవాలి. మన జీవితము యంత్రమయము కాదు. ఇలాంటి దివ్యమైన మానవత్వానికి దివ్యమైన మార్గమును మనము నిరూపించు చేయుటానికే యీ సంస్థలు ప్రారంభించాము. నీ శక్తి కొలది నీవు సమాజములో ప్రవేశించి తోటి మానవులకు సేవ చేయి. ఇంత అంత అని ఆడంబరాలకు నీవు ప్రవేశించ వద్దు. అహంకారమును ప్రవేశ పెట్టవద్దు. నీవొక దివ్యమైన సేవకుడుగా రూపొందు. సేవకుడు కాక నాయకుడు కాడు. కింకరుడు కాక శంకరుడు కాడు. కనుక యిందులో కార్యకర్తలంతా సంస్థలకంతా కూడను ఒక వెన్నెముక వంటి వారు.

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా మీరు కార్యకర్తలుగా వుండిన వారు సరైన మార్గాన్ని నడుచుకోవాలి. మీరేమైనా తప్పు మార్గమున ప్రవేశిస్తే యింక అందరు కూడను తప్పు మార్గమునే ప్రవేశిస్తారు. కనుక జగత్తున సరైన రీతిగా తీర్చి దిద్దాలనుకుంటే కార్యకర్తలు వున్నతమైన, నిస్వార్థమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. సేవాభావమునందు స్వార్థమును యేమాత్రము, స్వప్రయోజనమును యేమాత్రము ప్రవేశ పెట్టరాదు. ఇంక ఆడంబరాలకు యేమాత్రము అవకాశము నందించరాదు. ఈ ఆడంబరమైన జీవితమనేది యీనాడు జగత్తునంతను కేవలము మార్పు చేస్తుండాది. జగత్తు

బంధమైన విషయము లన్నింటి యందు కూడను ఈ ఆడంబరము అభివృద్ధి అయిపో యింది. అదే ఒక ఫ్యాషన్‌గా రూపొందింది. అది దేశానికి హానికరము గాని వుపయోగకరము కాదు. నిర్మాణాత్మకముగా వుండాలను కున్నప్పుడు నిస్వార్థమైన సేవలో వుంటుండాలి. ఈ ఆడంబరము దేశమును నిర్మూలము గావిస్తుంది. కనుక సత్యసాయి సంస్థలన్నీ కూడను కేవలము నిరాడంబరముగా, నిరహంకారముగా, నిస్వార్థముగా పవిత్రమైన ప్రేమ తత్వాన్ని పెంచుకొని దివ్యమైన త్యాగ తత్వాన్ని మనము అభివృద్ధి పరచుకొని సహన సానుభూతులను మనము ఆచరణలో పెట్టాలి. అదే నిజమైన సేవకునికి తగిన గుణము. ఇంతే కాకుండా అధికారమును మనము చలాయించరాదు. అధికారము అందరికి సమానమే. కానీ కర్తృత్వమును నీవు ఒక విధమైన స్థానములో వుండినప్పుడు సక్రమముగా చేస్తున్నాడా లేదా అనేదానిని గుర్తించటానికి ప్రయత్నించాలి.

ప్రేమకు అధికారమే లేదు. మన discipline ప్రేమతో సంబంధించినదిగా వుండాలి. మన సంస్థల యొక్క పద్ధతులన్నీ కూడను మిలట్రీ ఫోర్సుగా వుండకూడదు. ప్రేమ ఫోర్సుగా వుండాలి. ప్రేమతో మాట్లాడాలి. దోషము లేమైనా వుంటే ప్రేమతోనే చెప్పాలి. అన్నింటి యందు కూడను ప్రేమ తత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. దీనిని పురస్కరించుకొనియే

Start the day with Love
Spend the day with Love
Fill the day with Love
End the day with Love
This is the way to God.

మనము అన్ని విధముల కూడను ప్రేమతోనే జీవించాలి. ప్రేమయే దైవము. దైవమే సర్వత్రా వున్నది. మీ అందరు ప్రేమస్వరూపులే. ప్రేమతోనే జీవించండి. ప్రేమతోనే సేవించండి ప్రేమతోనే ఆనందించండి. ఈ ప్రేమలోనే లీనము కండి. ఇదే ప్రేమ యొక్క, నిజమైన సేవ యొక్క ప్రధాన కర్తవ్యము. ఇంక మరియే విషయములతో సంబంధము లేకుండా సత్యసాయి సంస్థలంతా కూడను ప్రేమ ప్రేమ, హృదయానికి హృదయము, ప్రేమకు ప్రేమను అందించుకుంటూ సంస్థలు అభివృద్ధి పరచాలి కాని ధనముతో గాని యింకే విధమైన అధికారములో గాని మన సంస్థలలో యే మాత్రము కూడను అవకాశము వుండరాదు. నాకు మందిరాలు అక్కరలేదు. ఆలయాలు అక్కర లేదు. యజ్ఞయాగాది క్రతువులు అక్కర లేదు. మన కర్మయే మనకు యజ్ఞము. మన సేవయే మనకు క్రతువు.

కనుక యజ్ఞయాగాదుల పేరుతో గాని, మందిరముల పేరులో గాని, యింకే విధమైన పేరుతో గాని సత్యసాయి సంస్థల లోపల వసూలు చేసే ఈ దుర్గుణమును మనము ఈనాటి నుండి మాను కోవాలి. నేను అనేక పర్యాయములు చెప్తూనే వున్నాను. ధనముతో మనకు ఎట్టి సంబంధము వుంటుండ కూడదు. గుణముతో సంబంధము వుంటుండాలి

22|11|88||

కొన్ని సంస్థలలో వుండిన వ్యక్తులే యీ ధనము collectionగా చేసి కొంతవరకు సన్నిహిత సంబంధ
బాంధవ్యాన్ని పెంచుకుంటున్నారు. ఇంకా కొంతమంది స్వామి పేరు చెప్పుకొని స్వామి నాకేదో
కొన్ని శక్తులు యిచ్చారని యీవిధమైన మార్గములో ధనమును వసూలు చేస్తున్నారు. ఇంత
కంటె రాక్షసత్వము మరొకటి లేదు. ఇంత కాలమైంది. నేను ఎప్పుడూ కూడను, ఎవ్వరిని కూడ
ను, ఏ విషయమందు నేను యీ విషయములో యేమాత్రము ప్రవేశించలేదు. కాని సాయి
పేరును కృప యొంగపెట్టి యీవిధమైన పెడమార్గములో పట్టిస్తూ సాయికి ఒకవిధమైన
చెడ్డ పేరును తెప్పిస్తున్నారు. ఇది కేవలము ఒక వ్యాపార రంగముగా రూపొందింప చేస్తున్నా
రు. నిజమే యిది వ్యాపారమే. ఏ వ్యాపారము. ప్రేమ యిచ్చి పుచ్చుకునే వ్యాపారము. కాని
సంస్థలలో వుండిన వ్యక్తులు కూడను యిలాంటి ధనమును ప్రోగు చేసే విషయములో
ప్రవేశించి వారిని వీరిని అనేక రకములుగా అభివృద్ధి పరచుకొని యెంత చెప్పినప్పటి
కిని డబ్బును వసూలు చేస్తూనే వున్నారు. కనుక ఎవరికైనా ఉపకారము గాని, యిప్పించు
కోటంగాని రెండు కూడా జరగ కూడదు. మన సంస్థలలో అందరు ఏమీ దరిద్రులు కారు
కొంతవరకు శ్రీమంతులు కూడా వుంటున్నారు. అలాంటి సేవలు చెయ్యాలంటే శ్రీమంతులు
కొంచెము ముందుకు వచ్చి యేమైనా సహాయము చేయ వచ్చుకదా. ఈ శ్రీమంతులు కూడ
ను యీ చిక్కమైత్తే దరిద్రము తీరకెందుకు. వుండేది చాలదా వాళ్ళకు. కనుక యిలాంటి
మార్గము లోపల ప్రవేశిస్తే సాయి సంస్థలకు చెడ్డపేరు వస్తుంది. నేను యిచ్చే ఆదేశము ఒక్క
టే. సాయి సంస్థలకు చెడ్డపేరు లేకుండా చూచుకోండి. అంతేగాని సంస్థలకు నాకు సంబం
ధము లేదు. అందరూ సంస్థలలో వున్న వ్యక్తులే. సమస్త భక్తులు కూడను చేరండి.
ఈ సాయి సంస్థలలో యే కొంతమందో మెంబర్సు, ఏ కొంతమందో
ఆఫీసు బేరర్సు అనే భేదము లేదు. భక్తుల నిమిత్తము యేర్పరుప బడినవే గాని యీ
సంస్థలు యింకొకరి నిమిత్తము కాదు. ప్రతి మానవునికి యిందులో అధికారము వుం
టుండాది. తన మానవత్వమును అభివృద్ధి పరచు కోటానికి ప్రతివ్యక్తికి అధికారము
వుంటుండాది. మానవతా విలువలు పెంచుకోవాలి గాని మనీ విలువలు పెంచుకోటం
కాదు మానవునకు. ఎక్కడే కాని సాయి సంస్థల లోపల యిలాంటి చందాలు వసూలు
చేయటంగాని, పూజలు పునస్కారములని పేర్లతో చందాలు వసూలు చేయటంగాని
జరిగితే అది సాయి సంస్థ కానేరదు. చాలామంది భక్తులలో కూడను యీ వ్యాపారము
లో ప్రవేశించి అలాంటివంతా చేస్తున్నారు. మీలో వారు కొంతమంది శ్రీమంతులు కల
సి యేదైనా కార్యము చేయాలంటే దాంలో చేసుకోటంలో తప్పులేదు. అంతేగాని యింటిం
టికి పోయి నీవు బిక్షము అడుక్కోటానికి యేమాత్రము ప్రయత్నం చేయకూడదు. సాయి
కి కావాలసినది లోకాస్సమస్తా స్సుఖినో భవంతు. అందరూ సుఖముగా వుంటుండాలి.
అందరూ మానవత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. మానవులకు మానవులు సహాయము
చేసుకోవాలి. ఈ విధమైన సమాన భావమును మానవులు పెంచుకోవాలి. అదియే బంగారు

221188 12

నరజన్మ దుర్లభం. నరజన్మ దుర్లభమనటానికి యిదే మూల కారణము.

దివ్యాత్మ స్వరూపులారా! ధనము యొక్క విషయము ఎక్కడ జరిగినప్పటికి యిది సాయీ సంస్థకు సంబంధము లేదని నిర్ణయము చేసుకోవాలి. మీరు సేవలు చెయ్యాలనుకుంటె మీ సంస్థలో వుండిన వ్యక్తులు మీరు మీరు చేసుకోటంలో తప్పులేదు. కనుక ముఖ్యముగా మన సంస్థలకు ప్రధానమైన అంశములు రెండే. ధనముతో సంబంధము వద్దు, గవర్నమెంటుతో సంబంధము వద్దు. మనకు ఎంత శక్తో అంత చిన్నదైనా చేసుకుందాము. గవర్నమెంటు చేసే వుపకారములు గవర్నమెంటు చేస్తూనే వున్నారు వారు చేసుకోనీ. వాళ్ళ పేరును వుపయోగపెట్టుకొని మనము యిందులో ప్రవేశించరాదు. మనము చేసేది మనము చేస్తాము. నీకు ఎంత శక్తో అంత సేవలో పాల్గొను. ఈ విధముగా వుంటే గవర్నమెంటు కూడను యింతో help చేస్తుంది. అంతేగాని వారితో యేమాత్రము సంబంధము పెట్టుకో కూడదు. మంచివారు మనము చేసే సేవలకు మెచ్చువారెంతైనా సహాయము చేయవచ్చును. దీనిని మనము నమ్ముకొని ముందుకు పోతే యింకొక ఆఫీసరు ఎవరైనా వచ్చి వారు దీనికి సహాయము చేయక పోవచ్చు. అప్పుడు మన సంస్థ గతి యేమిటి. కనుక మన బలముపైననే మనము ఆధారపడాలి. ఎవ్వరి బలము పైనను మనము ఆధారపడ కూడదు. అదే ఆత్మబలము. ఆత్మ బలమును విశ్వసించనివాడు యింక అన్నీ దుర్బలములే. కాని సేవలు మాత్రము చెయ్యాలి. సేవలలో మనము పాల్గొనాలి. ఈ సేవలలో జగత్తును సరైన మార్గములో తీర్చిదిద్దాలి. అప్పుడే మన భారతదేశము యొక్క విశిష్టతను యెంతైనా కొనియాడవచ్చును. మన యొక్క పేరు ప్రతిష్టల కోసం పాకులాడకండి. ప్రేమ నిమిత్తమై మీరు పాకులాడండి. ఇదే సాయీసంస్థలయొక్క ప్రధానమైన కర్తవ్యముగా మీరు గుర్తించాలి.